భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

22, సెప్టెంబర్ 2026, మంగళవారం భారత్ సమాచార్

మొబైల్ పోయిందా.. టెన్షన్ వద్దు!



భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా: పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గుర్తించి రికవరీ చేయడంలో మహబూబాబాద్ జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి., ఐపీఎస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన CEIR (Central Equipment Identity Register) పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ ఇప్పటివరకు జిల్లా పరిధిలో 2,027 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు వెల్లడించారు.

తాజాగా 77 మొబైల్ ఫోన్ల రికవరీ

జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి., ఐపీఎస్ మార్గదర్శకత్వంలో తాజాగా చేపట్టిన ప్రత్యేక చర్యల్లో 77 మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేశారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత బాధితులకు జిల్లా ఎస్పీ డా. శబరీష్ చేతుల మీదుగా అందజేశారు.

సాంకేతిక సమాచారంతో ఫోన్ల గుర్తింపు

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ CEIR పోర్టల్ ద్వారా అందుబాటులోకి వచ్చే సాంకేతిక సమాచారాన్ని విశ్లేషిస్తూ వివిధ ప్రాంతాల్లో వినియోగంలో ఉన్న పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తిస్తున్నామని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంతో ఫోన్ల అచూకీ గుర్తించి వాటిని రికవరీ చేయడం సాధ్యమవుతోందన్నారు.

ఈ ప్రక్రియలో మహబూబాబాద్ డీఎస్పీ, సీసీఎస్ ఇన్స్పెక్టర్ హతీరామ్, ఐటీ సెల్ ఎస్ఐ జి.వి. కృష్ణారెడ్డి, పీసీ సుమన్, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, CEIR ఆపరేటర్లు కీలక పాత్ర పోషించారని ఎస్పీ అభినందించారు.

మొబైల్ పోయిన వెంటనే పోలీసులకు సమాచారం

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. ఫోన్‌కు సంబంధించిన IMEI నంబర్, మొబైల్ నంబర్ తదితర వివరాలను పోలీసులకు అందించాలని తెలిపారు.

CEIR పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను బ్లాక్ చేయడంతో పాటు, అందుబాటులో ఉన్న సాంకేతిక సమాచారాన్ని విశ్లేషించి ఫోన్‌ను గుర్తించే అవకాశం ఉంటుందని ఎస్పీ వివరించారు.

CEIR సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజలు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించి CEIR సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ కోరారు.

ప్రజల ఆస్తి పరిరక్షణలో భాగంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందజేసేందుకు జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్పీ తెలిపారు.

© 2026 Bharath Samachar